# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 సంచిక: 228 సోమవారం 23-03-2026 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


ఇరుముడి కోసం రీమిక్స్ పాట?



08



# రైతుకు భరోసా

## నేటి నుంచే రైతుల ఖాతాల్లోకి నగదు!



- నర్మెట సభలో బటన్ నొక్కిన ముఖ్యమంత్రి..
- తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల
- మూడు విడతల్లో రూ.9 వేల కోట్ల పంపిణీ..
- 45 రోజుల్లోనే ప్రక్రియ పూర్తి
- ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం వేదికగా రైతులకు తీపి కబురు

2

## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ

# ప్రధాని మోదీ కీలక భేటీ

- ఢిల్లీలో మంత్రులతో ప్రధాని మోదీ సమీక్ష
- పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో ఇంధన కొరతపై ప్రధాని సమీక్ష
- నిరంతరంగా ఇంధన సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష

**హైదరాబాద్, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై ప్రధాని నరేంద్ర మోదీ సీనియర్ మంత్రులతో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోదీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్ , ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని, సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.
ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్

మిగతా 2వ పేజీలో..



# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి బిగ్ షాక్!

## రాజీనామాకు ముహూర్తం ఫిక్స్

‘పార్టీలో నాకు గౌరవం లేదు.. ఈ క్షోభ భరించలేను’

సీఎం రేవంత్ రెడ్డి తీరుపై సీనియర్ నేత తీవ్ర అసంతృప్తి

ఈ నెల 25న జగిత్యాలలో కీలక సమావేశం.. భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

2



## ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో

# సిట్ వేగం

- ఆర్థిక లావాదేవీలపై అధికారుల ఆరా!
- ప్రియాంక రెడ్డిని రెండు రోజుల పాటు విచారించిన అధికారులు
- నేడు రోహిత్, రితేష్, నమిత్ శర్మల కస్టడీపై కోర్టు తీర్పు

2

Special Investigation Team

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

## మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్

**హైదరాబాద్, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:** తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్

మిగతా 2వ పేజీలో..

# ఖాతాల్లోకి రూ.6 వేలు.. మూడు రోజులే ఛాన్స్..



రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి..

రేపటి నుంచి రైతుల ఖాతాల్లోకి జమ..

కొత్త వారికి మార్చి 25 వరకు గడువు..

**హైదరాబాద్, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:** తెలంగాణ అన్నదాతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు తీపి కబురు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగు పనుల్లో నిమగ్నమైన రైతన్నలకు అండగా నిలుస్తూ, రైతు భరోసా నిధులను నేడు విడుదల చేశారు. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నాయి. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేసింది. ఇంకా ఈ పథకం పరిధిలోకి రాని రైతుల కోసం ప్రభుత్వం మరో సువర్ణావకాశాన్ని కల్పించింది. ఇప్పటివరకు రైతు

మిగతా 2వ పేజీలో..



# ధరణిని బంగాళాఖాతంలో పడేశాం..

సాదాబైనాలకు పరిష్కారం చూపాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:** రైతుల కళ్లలో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎన్నికుట్రలు చేసినా రైతు సంక్షేమం ఆపమన్నారు. రైతులకు అనేక సమస్యలు సృష్టించిన ధరణిని

మిగతా 2వ పేజీలో..

# స్కూల్ పనుల్లో వేగం పెంచాలి

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
- లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పరిశీలన
- నాణ్యతలో రాజీ పడొద్దు.. ఇవి రేపటి తరాల దార్శనిక దేవాలయాలు

**ఖమ్మం, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:** విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి భవిష్యత్ తరాల కోసం పెట్టే పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న భవన సముదాయాలను కలియతిరుగుతూ పనుల తీరును భట్టి విక్రమార్క పరిశీలించారు. జూనియర్, సీనియర్ హాస్టళ్లు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లతో పాటు మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను మరింత వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను

మిగతా 2వ పేజీలో..





# ధురంధర్-2 స్క్రీనింగ్ రసాభాస...

- సగం సినిమా తెలుగులో, సగం సినిమా హిందీలో!

**హైదరాబాద్, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:** హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ మల్టీప్లెక్స్‌లో బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' సినిమా

మిగతా 2వ పేజీలో..

జర్నలిస్ట్ డైరీ

# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి బిగ్ షాక్!

- రాజీనామాకు ముహూర్తం ఫిక్స్
- 'పార్టీలో నాకు గౌరవం లేదు.. ఈ క్షోభ భరించలేను'
- సీఎం రేవంత్ రెడ్డి తీరుపై సీనియర్ నేత తీవ్ర అసంతృప్తి
- ఈ నెల 25న జగిత్యాలలో కీలక సమావేశం.. భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

**జగిత్యాల, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:**

తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్‌లో పెను తుఫాను చెలరేగింది. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి వెన్నుముకగా ఉంటూ, అత్యంత గౌరవప్రదమైన నాయకుడిగా పేరున్న మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో తనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని, తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్నానని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై జీవన్ రెడ్డి బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కారు. "నాకు అన్యాయం చేసిన వారిలో సీఎం రేవంత్ రెడ్డి కూడా ఒకరు. ఆయన వల్ల నా గౌరవానికి భంగం కలిగింది. నాకు ఆయనపై గౌరవం ఉన్నా, నా సమస్యకు ఆయన దగ్గర కూడా పరిష్కారం లేదు" అని జీవన్ రెడ్డి పేర్కొనడం గమనార్హం. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యే సంజయ్, ఇతర నేతలకు ప్రాధాన్యత పెరగడం, సీనియర్లను విస్మరించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ అంశాలతో పాటు ప్రభుత్వ పనితీరుపై కూడా జీవన్ రెడ్డి ప్రశ్నలు సంధించారు. మేడిగడ్డ రిపేర్ల విషయంలో జాప్యం ఏంటని, రైతాంగానికి సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అని నిలదీశారు. పదిమంది ఎమ్మెల్యేలను పార్టీ వ్యవహారాలకు దూరం పెట్టగలరా అని ప్రశ్నిస్తూ అధిష్టానాన్ని ఇరకాటంలో పెట్టారు.

**25న 'బండారు గార్డెన్'లో తేల్చుకోనున్న జీవన్ రెడ్డి**

తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవడానికి ఈ నెల 25వ తేదీని ఆయన గడువుగా నిర్ణయించారు. జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో తన అనుచరులు, ముఖ్య నేతలు, కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించనున్నారు. "నాలుగు దశాబ్దాలుగా నాతో నడిచిన కార్యకర్తల సూచనల మేరకే నా తదుపరి అడుగు ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బేనా?**

క్లీన్ ఇమేజ్ ఉన్న జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లోపే పార్టీ అధిష్టానం రంగంలోకి దిగి ఆయనను బుజ్జగిస్తుందా? లేక జీవన్ రెడ్డి తన సొంత దారిని చూసుకుంటారా? అనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ ఆయన పార్టీ మారితే జగిత్యాల రాజకీయ సమీకరణలు పూర్తిగా తలకిందులు కావడం ఖాయం.

# ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో సిట్ వేగం

- ఆర్థిక లావాదేవీలపై అధికారుల ఆరా!
- ప్రియాంక రెడ్డిని రెండు రోజుల పాటు విచారించిన అధికారులు




**హైదరాబాద్, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:**

తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో ప్రత్యేక విచారణ బృందం దర్యాప్తును మరింత ముమ్మరం చేసింది. ఈ కేసులో ముడిపడి ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు, తాజాగా విచారణలో వేగం పెంచారు. ఈ కేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న ప్రియాంక రెడ్డిని సిట్ అధికారులు వరుసగా రెండు రోజుల పాటు విచారించారు. ప్రధానంగా ఆమె వద్ద లభించిన బ్యాగులోని భారీ నగదుకు సంబంధించిన ఆధారాలను, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరికి చేరవేయాలి? అనే కోణంలో అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. అలాగే, గతంలోనూ ఆమెకు ఇలాంటి అక్రమ కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా వివరాలు సేకరించినట్లు సమాచారం. నోటీసులు అందుకున్న ఏడుగురిలో నలుగురిని ప్రస్తుతం సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటికే ఐదు రోజులుగా కౌశిక్ రవి, అర్జున్, శ్రావణ్‌లను అధికారులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. వీరి ఆర్థిక లావాదేవీలు, డ్రగ్స్ నెట్‌వర్క్‌తో ఉన్న సంబంధాలపై అధికారులు దృష్టి సారించారు. నిందితుల ఫోన్ డేటా, బ్యాంక్ స్టేట్‌మెంట్లను కూడా అధికారులు విశ్లేషిస్తున్నారు.

**నేడు కీలక తీర్పు**

మరోవైపు, ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రోహిత్, రితేష్, నమిత్ శర్మలను తమ కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టును కోరారు. దీనిపై వాదనలు పూర్తికాగా, కోర్టు నేడు (సోమవారం) తన తీర్పును వెలువరించనుంది. కోర్టు కస్టడీకి అనుమతినిస్తే, ఈ డ్రగ్స్ రాకెట్ వెనుక ఉన్న మరిన్ని కీలక సూత్రధారుల పేర్లు బయటపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ధరణిని బంగాళాఖాతంలో పడేశాం..

**మొదటిపేజీ తరువాయి**

బంగాళాఖాతంలో కలిపామన్నారు. సాదాబైనామాలన్నింటికీ పరిష్కారం చూపామన్నారు. ఆదివారం (మార్చి22) సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు మంత్రి పొంగులేటి. అంతకుముందు మూడు వందల కోట్ల రూపాయలతో సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీనిసీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఫ్యాక్టరీని ప్రారంభించి రైతన్నలకు అంకితం చేశారు. అక్కడే రూ.80 కోట్లతో నిర్మించే రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయిల్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రులు వివేక్ వెంకట స్వామి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అద్భుతమైన అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని.. కొత్త ఉద్యోగాల కల్పనకు ఏటీసీలు ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్కిల్ నేర్పించి ఉద్యోగాలు ఇప్పిస్తున్నామన్నారు. ఏటీసీలో ట్రైనింగ్ తీసుకుని విద్యార్థులకు రూ.2 వేలు ఇస్తున్నామని తెలిపారు. సిద్ధిపేటలో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు.


# స్కూల్ పనుల్లో వేగం పెంచాలి

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించారు. "ఇవి కేవలం భవనాలు మాత్రమే కాదు.. రేపటి తరాలను ఉజ్వలంగా తీర్చిదిద్దే దార్శనిక దేవాలయాలు" అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. పాఠశాలల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు గట్టిగా సూచించారు. విద్యారంగానికి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతుకు భరోసా

- నేటి నుంచే రైతుల ఖాతాల్లోకి నగదు!
- నర్మెట సభలో బటన్ నొక్కిన ముఖ్యమంత్రి..
- తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల
- మూడు విడతల్లో రూ.9 వేల కోట్ల పంపిణీ..
- 45 రోజుల్లోనే ప్రక్రియ పూర్తి
- ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం వేదికగా రైతులకు తీపి కబురు



**సిద్దిపేట, మార్చి 22, జర్నలిస్ట్ డైరీ:**

తెలంగాణలోని లక్షలాది మంది అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'రైతు భరోసా' నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట గ్రామంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. సభ వేదికగా బటన్ నొక్కి పెట్టుబడి సాయాన్ని విడుదల చేయగా, నేడు బ్యాంకులకు సెలవు కావడంతో నేడు సోమవారం ఉదయం నుంచి రైతుల అకౌంట్లలో ఈ నగదు జమ కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి మొత్తం రూ.9 వేల కోట్ల నిధులను మూడు విడతల్లో పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

- విడతల వారీగా నిధుల పంపిణీ

తొలి విడతలో భాగంగా ఎకరం భూమి లోపు ఉన్న సుమారు 24.32 లక్షల మంది రైతుల కోసం రూ.3,590 కోట్లను ప్రభుత్వం నేడు విడుదల చేసింది. దీనిని అనుసరించి మరో 20 రోజుల తర్వాత రెండో విడతలో రూ.2,650 కోట్లను, ఆ తర్వాత 25 రోజులకు మూడో విడతలో మిగిలిన రూ.2,760 కోట్ల నిధులను అందజేయనున్నారు. మొత్తంగా రాబోయే 45 రోజుల్లోనే రాష్ట్రంలోని రైతులందరికీ పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయం అందుతుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా సాయాన్ని ఎకరాకు ఏడాదికి రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం పాత పద్ధతిలోనే అంటే ఎకరాకు ఏడాదికి రెండు విడతల్లో కలిపి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది.

**రైతు సంక్షేమమే మా లక్ష్యం**

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులు ఉండగా, వారిలో ఎకరం కంటే ఎక్కువ భూమి ఉన్నవారు 48.68 లక్షల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించడంతో పాటు, ప్రతి పంటకూ పెట్టుబడి సాయం సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం వివరించారు. నిధుల విడుదలపై వస్తున్న విమర్శలకు నర్మెట సభ వేదికగా ఆయన సమాధానమిచ్చారు. పారదర్శకంగా, అర్హులైన ప్రతి రైతుకూ ఈ సాయం అందుతుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొని ముఖ్యమంత్రి నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

**అన్ని నియోజకవర్గాలు ఒక్కటే..**

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల రాబోయే రోజుల్లో మనకు యూరియా కొరత వచ్చేలా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా బీజేపీ ఎంపీలు సహకరించాలని కోరారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేద్దాం.. ఎన్నికలు లేనప్పుడు ప్రాంతాల అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు సమస్యలు తీసుకువచ్చిన ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుతో రాజకీయాంగా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ ఆ నియోజకవర్గాల ప్రజల అభివృద్ధి కోసం కూడా పని చేస్తామన్నారు. తాను ఏ నియోజకవర్గంపైన వివక్ష చూపించనని.. వివక్ష మా ఇంటా వంటానే లేదని చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీని కొడంగల్‌కు తరలించగలిగేవాణ్ని కానీ తాను అలా చేయలేదన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

**మొదటిపేజీ తరువాయి**


యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్స్‌లర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

# ఖాతాల్లోకి రూ.6 వేలు.. మూడు రోజులే ఛాన్స్..

**మొదటిపేజీ తరువాయి**

భరోసా నిధులు పొందని వారు, లేదా బ్యాంక్ వివరాల్లో తప్పులు ఉన్నవారు మార్చి 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఫిబ్రవరి 28, 2026 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు కూడా ఇప్పుడు అప్లై చేసుకోవచ్చు.

అర్హులైన రైతులు తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణాధికారిని (AEO) కలిసి దరఖాస్తు ఫారమ్ సమర్పించాలి. దరఖాస్తుతో పాటు కొత్త పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను జత చేయాలి. రైతులు సమర్పించే బ్యాంక్ ఖాతా తప్పనిసరిగా కేవైసీ (KYC) పూర్తి చేసి ఉండాలి. ఆధార్ సీడింగ్ లేకపోతే డబ్బులు జమ కావడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు కాబట్టి, వెంటనే మీ పరిధిలోని రైతు వేదికలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలి. సాగు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న సన్నకారు రైతులకు ఈ నిధులు ఎంతో ఊరటనివ్వనున్నాయి.



# ధురంధర్2 స్క్రీనింగ్ రసాభాస...

**మొదటిపేజీ తరువాయి**

ప్రదర్శన సందర్భంగా తీవ్ర గందరగోళం నెలకొంది. పంజాగుట్టలోని నెక్స్ట్ గల్లేరియా మాల్‌లో ఉన్న పీవీఆర్ థియేటర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకే స్క్రీన్‌కు హిందీ, తెలుగు వెర్షన్ల టికెట్లను విక్రయించడమే ఈ రచ్చకు కారణంగా నిలిచింది. సినిమా ప్రదర్శన మధ్యలో యాడ్స్ వస్తున్న సమయంలో స్క్రీనింగ్‌ను నిలిపివేశారు. దీంతో హిందీ, తెలుగు టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులు ఒకరితో ఒకరు తీవ్ర వాగ్వాదానికి దిగారు. 'మేము తెలుగు వెర్షన్ టికెట్లు ముందుగా బుక్ చేసుకున్నాం' అని ఓ మహిళ గట్టిగా నిలదీయగా, మరికొందరు మేం హిందీ వెర్షన్ కు టికెట్లు కొన్నాం... మెట్లపై కూర్చునే సినిమా చూస్తామంటూ ఆందోళనకు దిగారు. దీంతో థియేటర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు థియేటర్ సిబ్బంది, పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. సుదీర్ఘ చర్చల తర్వాత యాజమాన్యం హిందీ వెర్షన్‌ను ప్రదర్శించాలని నిర్ణయించింది. దీంతో తెలుగు టికెట్లు కొన్న ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ గొడవకు సంబంధించిన దృశ్యాలను ఓ నెటిజన్ వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా, అది కాస్తా వైరల్‌గా మారింది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన 'ధురంధర్ 2: ది రివెంజ్' చిత్రం మార్చి 19న విడుదలైంది. ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. విడుదలైన కొద్ది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 501 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద భారీ విజయం దిశగా దూసుకెళ్తోంది. అయితే, టికెటింగ్ ప్లాట్‌ఫామ్‌ల తప్పిదాల వల్ల ఇలాంటి ఘటనలు జరగడం ప్రేక్షకుల అనుభూతిని దెబ్బ తీస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


# పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ప్రధాని మోదీ కీలక భేటీ

**మొదటిపేజీ తరువాయి**

జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు.

**గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు**


మరోవైపు గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపులను పెంచింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG) సరఫరాను పెంచేందుకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ దరఖాస్తులను 10 రోజులలోపు పరిష్కరించాలని పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (PESO) ఆదేశించింది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, పీఎన్‌జీకి మారాలని పట్టణ, నగరాల్లోని వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు సూచించింది.



అటు ఎల్పీజీకి సంబంధించి ఇప్పటికే పునరుద్ధరించిన 20 శాతానికి అదనంగా మార్చి 18న మరో 10 శాతం, మార్చి 21న మరో 20 శాతం కేటాయింపులు పెంచారు. ఫలితంగా LPG సరఫరా 50 శాతానికి చేరింది. హోటళ్లు, రెస్టారెంట్లు, డైరీ పరిశ్రమలు, కమ్యూనిటీ కిచెన్‌లు, విద్యాసంస్థలకు సరఫరాలో ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డొమెస్టిక్ వంట గ్యాస్ సరఫరా స్థిరంగా ఉందని, ఎక్కడా కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. భయాందోళనలతో చేసే బుకింగ్‌లు కూడా తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం పేర్కొంది.

**రష్యా నుంచి భారత్‌కు చేరిన మరో చమురు నౌక**

మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ మరో చమురు నౌక భారత్‌కు చేరుకుంది. రష్యాకు చెందిన చమురు లోడుతో ఉన్న ట్యాంకర్, MT ఆక్వా టైటాన్ అనే నౌక మంగళూరు తీరానికి సుమారు 10 నాటికల్ మైళ్ల దూరంలోకి చేరుకుంది. ఆ ట్యాంకర్ త్వరలోనే పోర్టుకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఇది మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (MRPL) ఆధ్వర్యంలోని నౌకని చెప్పారు. అంతకుముందు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం, నెదర్లాండ్ పోర్ట్ నుంచి పైక్సిస్ పయనీర్ అనే భారీ LPG నౌక కర్ణాటకలోని న్యూ మంగళూరు పోర్ట్‌కు చేరుకుంది. ఈ నౌక సుమారు 16వేల 714 టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్‌ను మోసుకొచ్చింది. 'ఏజిస్ లాజిస్టిక్స్ లిమిటెడ్' కోసం దీన్ని దిగుమతి చేసుకున్నారు. ఫిబ్రవరి 14న అమెరికా నుంచి బయలుదేరిన ఈ నౌక, సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ తెల్లవారుజామున మంగళూరు తీరానికి చేరుకుంది. గల్ఫ్ దేశాల నుంచి ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, అమెరికా వంటి దేశాల నుంచి అందుతున్న ఈ సరఫరా భారత్‌కు ఎంతో కీలకం కానుంది. రాబోయే వారంలో మరిన్ని నౌకల ద్వారా న్యూ మంగళూరు పోర్ట్ మొత్తం 72వేల 700 టన్నుల LPGని అందుకోనుంది. ఇక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు వంటగ్యాస్ సరఫరా చేయనున్నారు.



# నిస్వార్థ నాయకుడు కొండిగారి రాములు

**జర్నలిస్ట్ డైరీ, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని వైష్ణవి గార్డెన్‌లో ఆదివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరై, రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, రాములు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపారని తెలిపారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో ఎల్లప్పుడూ ప్రజల అభ్యున్నతిని కోరుకున్న నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. భవిష్యత్తులో రాములు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తదుపరి రాములు కుటుంబ సభ్యులైన ఇబ్రహీంపట్నం 12వ వార్డ్ కౌన్సిలర్ కొండి తిలక్, కిరణ్ కుమార్‌లను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చీరాల రమేష్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ భరత్ కుమార్, వైస్ చైర్మన్ సుల్తాన్, మాజీ కౌన్సిలర్లు ఆకుల సురేష్, మల్లేష్ యాదవ్, ముత్యాల చిన్న, బీఆర్ఎస్వీ మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి, బిట్టు ప్రవీణ్, ఎండీ ఝనీ, కరుణాకర్ రెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం హుండీ ఆదాయం ఏడు కోట్లు దాటింది

**జర్నలిస్ట్ డైరీ,శ్రీశైలం:**

శ్రీశైలం మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం రికార్డు స్థాయికి చేరింది. ముఖ్యంగా ఉగాది మహోత్సవాల సందర్భంగా భక్తులు పెద్దఎత్తున కానుకలు సమర్పించడంతో దేవస్థానానికి భారీ ఆదాయం లభించింది. దేవస్థాన అధికారులు నిర్వహించిన తాజా హుండీ లెక్కింపులో 7,19,58,064 రూపాయల నగదు లభించింది. ఇది కేవలం 30 రోజుల వ్యవధిలో వచ్చిన ఆదాయం కావడం విశేషం. ఈ ఆదాయం గత నెలలతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. హుండీ లెక్కింపులో నగదు మాత్రమే కాకుండా విలువైన వస్తువులు కూడా స్వామివారికి భక్తులు సమర్పించారు. బంగారం: 122 గ్రాములు 200 మిల్లీగ్రాములు, వెండి: 6 కిలోల 550 గ్రాములు, విదేశీ కరెన్సీ: వివిధ దేశాలకు చెందిన నోట్ల రూపంలో స్వామివారికి కానుకగా సమర్పించారు. ఉగాది పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు శ్రీశైలం మల్లన్న ఆలయానికి పోటెత్తారు. హుండీ లెక్కింపు ప్రక్రియను ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ సిబ్బంది సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు. సీసీటీవీ కెమెరాల నిఘాలో లెక్కించారు. భక్తులు సమర్పించిన విదేశీ కరెన్సీని బ్యాంక్ అధికారుల ద్వారా విలువ కట్టనున్నారు.

# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ఇతర హామీలను తక్షణమే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ కొందుర్గ్ మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల రెవెన్యూ అధికారికి బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. యువ వికాసం జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి కీలక హామీలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రైతు భరోసా అందక, రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడి కోసం మళ్ళీ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రావాల్సిన కొత్త పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని, అలాగే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో నిర్వహించిన 'ప్రజాపాలన'లో సమర్పించిన దరఖాస్తులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, గ్రామాల్లో డ్రైనేజీ, సిసి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు, సామాన్యులకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో బీజేపీ తరపున పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి, కందూరి మనోహర్ రెడ్డి, బోయ శంకర్, కొమరబండ శ్రీశైలం, శివారెడ్డి, సున్నాల అంజయ్య, కార్తీక్ యాదవ్, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ చారి, కాటంరాజు గౌడ్, నర్సింలు, శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, వీరయ్య, యాదగిరి, యాదయ్య, నవీన్ , జి.బి.శేఖర్, వెంకటేష్, కార్యకర్తలు మరియు పాల్గొన్నారు.

# ఉయ్యూరులో డెంటల్ హాస్పిటల్ ప్రారంభం

**జర్నలిస్ట్ డైరీ ,ఉయ్యూరు:**

కృష్ణా జిల్లా ఉయ్యూరులోని కాటూరు రోడ్ లో డాక్టర్ పామర్తి నవీన, మణికుమార్ ఆధ్వర్యంలో పిన్నమనేని హాస్పిటల్ ప్రక్కన నూతనంగా మొదలు పెడుతున్నటువంటి సాయిరాం డెంటల్ కేర్ హాస్పిటల్ ను రిబ్బన్ కట్ చేసి మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఉయ్యూరు పట్టణం అన్ని రంగాలలో దినదినాభివృద్ధి చెందుతుందని, ముఖ్యంగా విద్యా మరియు వైద్య రంగాలలో నూతనంగా స్కూల్స్ కాలేజీలు, హాస్పిటల్స్ ప్రారంభించడం జరుగుతుందని, ఉయ్యూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ మీ అందరికీ అందిస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాకాని శ్రీను, రాజుల పాటి ఫణి, సుంకర అయ్యప్ప,పామర్తి శివ,పవన్ తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ కొరత పై కలెక్టర్ సమీక్ష



**జర్నలిస్టు డైరీ, కర్నూలు బ్యూరో:**

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి రోజురోజుకు తీవ్రమవుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు గ్యాస్ ఇతర వ్యత్యావసర వస్తువుల ధరలు మరింత భగ్గుమంటున్నాయి యుద్ధం ఇప్పుడే ముగిసేటట్లు కనిపించకపోవడంతో దేశవ్యాప్తంగా గ్యాస్ ఆయిల్ వినియోగంపై అధికారులు ముందస్తుగా వినియోగదారులకు తగు సూచనలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు కర్నూల్ జిల్లాలో గ్యాస్ వినియోగం తగ్గించేందుకుగాను జిల్లా కలెక్టర్ వినియోగదారులకు పలు సూచనలు జారీ చేశారు.ఇండక్షన్ స్టవ్, సోలార్, ఎలెక్ట్రిక్ కుక్కర్ లాంటివి ప్రజలు వినియోగించే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.

ఆదివారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయం నుండి ఎల్పిజి గ్యాస్ అంశం పై డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భం వచ్చినట్లు ఐయితే ప్రజల అవసరాలను తీర్చడానికి జిల్లాలో ఇండక్షన్ స్టవ్, సోలార్, ఎలెక్ట్రిక్ కుక్కర్ ల సరఫరా ఏ మాత్రం ఉందనే సమాచారం తో ప్రత్యేక ప్రణాళిక ఉండాలన్నారు. హైదరాబాద్, బెంగళూరులో ఉన్న తయారీ కంపెనీలు ,వాటి సరఫరా సామర్థ్యం గురించిన వివరాలు సేకరించాలని కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజను కలెక్టర్ ఆదేశించారు. ఇంటి ఇంటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా కూడా లేదని, కేవలం ఈ ప్రత్యామ్నాయ పద్ధతులు మాత్రమే ఉన్నాయన్నారు. గ్యాస్ సరఫరా కంటే ముందు, కిరోసిన్ ను వంట ఇంధనంగా వాడేవారన్నారు. అందుకుగాను కిరోసిన్ స్టౌవ్‌ల డేటా కూడా కావాలన్నారు. కిరోసిన్ స్టౌవ్‌ల డేటా కూడా సిద్ధం చేసి ఇవ్వాలని కలెక్టర్ కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ ను ఆదేశించారు. ఒకవేళ ప్రభుత్వం కిరోసిన్ ను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంటే, మన దగ్గర డేటా ఉండాలన్నారు. గ్యాస్ వాడకాన్ని తగ్గించి సోలార్ కుక్కర్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, ఇండక్షన్ స్టౌలు లాంటి పరికరాలను పంపిణీ చేసే ప్రణాళికను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కి కలెక్టర్ సూచించారు. రాబోయే సమావేశం కోసం ప్రస్తుతం ఉన్న గ్యాస్ సరఫరా కొరత పరిస్థితి, గ్యాస్ వినియోగాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు, సోలార్ కుక్కర్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, ఇండక్షన్ స్టౌలు లాంటి పరికరాల ధరలు, ఏజెన్సీల వద్ద వాటి లభ్యత ఇంకా ఎంత బడ్జెట్ అవసరమవుతుందనే వివరాలు అన్నిటిని క్రోడీకరించుకొని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు.

జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వంట గ్యాస్ ను ఏ విధంగా పొదుపు చేసుకోవచ్చు , ప్రత్యామ్నాయ పద్ధతులు ఏమిటి అన్న విషయాలు తెలియజేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డి పి ఓ భాస్కర్, డి సి ఎస్ ఓ రాజా రఘువీర్ , ఆర్డిఓ సందీప్ కుమార్, ఇండస్ట్రీస్ ప్రమోషన్ ఆఫీసర్ డానియల్ , ఫుడ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు , తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్ జిల్లా అడవుల్లో కార్చిచ్చు

**జర్నలిస్ట్ డైరీ,నిర్మల్:**

నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండల పరిధిలోని అడవుల్లో భారీగా మంటలు చెలరేగాయి. ముఖ్యంగా దేవునిగూడ గ్రామానికి సమీపంలో ఉన్న హరిత వనంలో కార్చిచ్చు వేగంగా విస్తరిస్తోంది. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండిన ఆకులు, గడ్డి వల్ల మంటలు అంటుకున్నాయి. దేవునిగూడ సమీపంలోని మొక్కలు, చెట్లకు మంటలు అంటుకోవడంతో పెద్దఎత్తున పొగలు కమ్ముకున్నాయి. అడవిలోని జీవవైవిధ్యానికి ఇది పెద్ద ముప్పుగా మారింది.

అడవిలో మంటలు చెలరేగడం వల్ల చిన్న చిన్న జీవులు, పక్షులు మృత్యువాత పడే అవకాశం ఉంది. అలాగే పెద్ద జంతువులు ప్రాణభయంతో జనవాసాల్లోకి వచ్చే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.

మంటలు చెలరేగి గంటలు గడుస్తున్నా, అటవీశాఖ అధికారులు ఇప్పటివరకు ఘటనా స్థలానికి చేరుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో అధికారులు స్పందించి ఉంటే మంటలు ఇంతలా వ్యాపించేవి కావని ప్రజలు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అడవుల్లో సీసీ కెమెరాలు లేదా వాచ్ టవర్ల ద్వారా నిరంతరం అటవీశాఖ అధికారులు పర్యవేక్షించాలని స్థానికులు కోరారు.

# ఔటర్ రింగ్ రోడ్డు పై ప్రమాదం

- **ఒకరు మృతి...**
  **ఇద్దరికి తీవ్ర గాయాలు**

**జర్నలిస్ట్ డైరీ, రాజేంద్ర నగర్:**



నగరంలోని రాజేంద్రనగర్ ఔటర్ రింగ్ రోడ్డు, హిమాయత్ సాగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హిమాయత్ సాగర్ వద్ద ఒక్కసారిగా ముందు వెళ్తున్న లారీని.. కారు అత్యంత వేగంతో వచ్చి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో ప్రయాణిస్తున్న ధీరజ్ నాయుడు అనే యువకుడు మృతిచెందారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందజేశారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డుపై హిమాయత్ సాగర్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారు, ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు యువకులు ఉన్నారు. కారు ముందు భాగం లారీ కిందకు దూసుకుపోవడంతో, కారులో ప్రయాణిస్తున్న ధీరజ్ నాయుడు అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

# కుందన్‌బాగ్‌లో స్లాబ్ కూలి ఇద్దరు మృతి

**జర్నలిస్ట్ డైరీ,పంజాగుట్ట:**



హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రీ కొడుకులు ప్రాణాలు కోల్పోయారు . కుందన్‌బాగ్‌లోని శ్రీవాత్స మూడవ అంతస్తులో బాల్కనీ పొడిగింపు పనులు జరుగుతుండగా ఐరన్ రాడ్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు మరణించగా, అపార్ట్‌మెంట్ యజమాని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుందన్‌బాగ్‌లోని శ్రీవాత్స అపార్ట్‌మెంట్‌లో మూడవ అంతస్తులో నివసించే ద్వారక ప్రసాద్ ఇంట్లో ఎలక్ట్రికల్ పనులు చేయడానికి తండ్రీకొడుకులైన దేవిదాస్, వివేక్ వచ్చారు. ఐరన్ రాడ్లతో నిర్మించిన బాల్కనీలో కూర్చుని యజమాని ద్వారక ప్రసాద్‌తో పనుల గురించి మాట్లాడుతుండగా, అకస్మాత్తుగా ఆ ఐరన్ రాడ్ స్లాబ్ కుప్పకూలింది. బాల్కనీతో పాటు ముగ్గురూ మూడవ అంతస్తు నుంచి నేరుగా కింద పడిపోయారు. వర్కర్ వివేక్ ఘటనా స్థలంలోనే మరణించగా, తండ్రి దేవిదాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. యజమాని ద్వారక ప్రసాద్ ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# కల్తీ పాల ఘటనలో మరొకరు మృతి

**జర్నలిస్ట్ డైరీ,రాజమండ్రి:**



రాజమండ్రి కల్తీ పాల ఘటనలో మరణించిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. స్థానిక రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన పిచ్చుక నాగేశ్వరరావు (72) శనివారం అర్ధరాత్రి మరణించారు. దీంతో కల్తీ పాల ఘటనతో మరణించిన వారి సంఖ్య 16కు చేరింది. కల్తీ పాలు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన నాగేశ్వరరావు కిడ్నీలు రెండు పాడయ్యాయి. వెంటిలేటర్ మీద చికిత్స పొందుతూ అతడు మరణించారు. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మరొక వ్యక్తి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన రాజమండ్రిలో కల్తీ పాలు ఘటన చోటు చేసుకుంది. పాలలో ఇథిలీన్ గ్లైకా కాల్ అనే అత్యంత విషపూరిత రసాయనం కలిసినట్లు అధికారులు నిర్ధారించారు. పాలను నిల్వ చేసే ఫ్రిజర్‌లో ఈ ఇథిలీన్ గ్లైకాల్ లీకయి పాల క్యాన్లలో కలవడం వల్లే ఈ ఘోరం జరిగిందని పోలీసుల దర్యాప్తులో బహిర్గతమైంది. ఈ పాలు తాగిన వారిలో వృద్ధులు, చిన్నారులు అధికంగా ఉన్నారు. ఈ కల్తీ పాల ఘటనలో 64 ఏళ్ల కొండబాబు మాత్రమే కోలుకున్నారు.

కల్తీ పాలు తాగిన వారిలో కిడ్నీ ఫెయిల్యూర్ తదితర లక్షణాలు కనిపించాయి. ఈ ఘటనతో తీవ్ర అనారోగ్యం పాలైన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తుంది. ఈ ఘటనలో పాల వ్యాపారి గణేశ్వరరావును ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

# బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సమావేశం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగూడ మండలం పద్మారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో సర్పంచ్ మోహన చారి నివాసంలో జరిగిన ఈ సమావేశానికి బీఆర్ఎస్ యువనాయకులు వై. మురళీకృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే పార్టీకి బలమైన స్తంభాలని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, వారి గౌరవం, భద్రత కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మండలంలో నూతనంగా గెలుపొందిన సర్పంచులను సన్మానించి, గ్రామ అభివృద్ధిలో ముందుండాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు, గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.






# ఎదిర గ్రామంలో వాటర్ ప్లాంట్

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని మహబూబ్ నగర్ ఎంపీ శ్రీమతి డీకే అరుణ అన్నారు. జిల్లెడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామంలో అరబిందో ఫౌండేషన్ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అరుణ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు జరుతున్నాయి అంటే కేంద్రప్రభుత్వం నిధుల ద్వారానే జరుగుతున్నాయని ప్రతి గ్రామ సర్పంచ్ కు తెలుసు అని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు గాని, అంగన్వాడీ భవనాలు గాని, దాన్య సేకరణ గోదాం లు గాని గ్రామ పంచాయతీ భవనాలు గాని, పాఠశాల భవనం విటన్నిటికీ కేంద్రప్రభుత్వం నిదులే అని అన్నారు. ఒక పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీలు ఉంటాయి కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కూడ గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, ఎదిర గ్రామ సర్పంచ్ దొడ్ల లక్ష్మిదామోదర్ రెడ్డి, చౌదరి గూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు, చెంది మహేందర్ రెడ్డి, వెంకటేష్ గుప్త, కందూరి మనోహర్ రెడ్డి, డాక్టర్ విజయ్ కుమార్, విజయ భాస్కర్, కొందుర్గు, కొత్తూరు మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 25 న నిర్ణయం ప్రకటిస్తా

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రకటన



జర్నలిస్ట్ డైరీ,జగిత్యాల:

ఈ నెల 25వ తేదీన తన రాజకీయ భవిష్యత్తు పై నిర్ణయం ఉంటుందని మాజీ మంత్రి టీ. జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాలుగా తనతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వాలని అన్నారు. జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో 25న తన ముఖ్య నేతలతో సమావేశమై ఓ నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేనని.. ఈ క్షోభ భరించలేనని అన్నారు. పార్టీలో తనకు గౌరవం లేదని తెలిపారు. తనకు అన్యాయం చేసిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఒకరని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వల్ల తన గౌరవానికి భంగం కలిగిందన్నారు. తనకు రేవంత్ అంటే గౌరవం ఉన్నా.. తన సమస్యకు పరిష్కారం ఆయన దగ్గర కూడా లేదని తెలిపారు. పదిమంది ఎమ్మెల్యేలను పార్టీ వ్యవహారాలకు దూరం పెట్టగలరా..? అని ప్రశ్నించారు. మేడిగడ్డను రిపేర్ చేసే బాధ్యత లేదా..? అని నిలదీశారు. రైతాంగం సాగునీటికి ఇబ్బంది పడుతోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో తన అనుచరులు, ముఖ్య నేతలతో జీవన్‌రెడ్డి భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు కార్యకర్తల సూచనల మేరకు తన తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు.'నాలుగు దశాబ్దాలుగా నాతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వండి. మీ అభిప్రాయం మేరకే నా భవిష్యత్ నిర్ణయం ఉంటుంది' అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.



## నిర్దవెల్లి గ్రామంలో నూజివీడు సీడ్స్ రైతు క్షేత్ర ప్రదర్శన

జర్నలిస్ట్ డైరీ

కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామంలోని తోట వెంకటేశ్ పొలంలో ఆదివారం నూజివీడు సీడ్స్ వారి ఆధ్వర్యంలో NMH 8413 విన్నర్ గోల్డ్ మొక్కజొన్న పంటపై అవగాహన నిర్వహించారు. విన్నర్ గోల్డ్ పంటతో వచ్చే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు టీఎస్ఎల్ జే నర్సింహులు, ఆర్ఎం రాములు, జెడ్ ఎం భరత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సీ భాస్కర్ గౌడ్ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.




## నవోదయ ఫలితాలలో రేయాన్ విద్యార్థుల ప్రతిభ

జర్నలిస్ట్ డైరీ, నాగోలు:

2026 జవహర్ నవోదయ ఫలితాలలో నాగోలు బండ్లగూడలోని రేయాన్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జాతీయ ర్యాంకులతో పాటు. 5 జిల్లాల్లో తమ విద్యార్థులు అగ్రస్థానాన్ని కేవసం చేసుకున్నారని రేయాన్ కోచింగ్ సెంటర్ అధినేత జి. జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం బండ్లగూడ రేయాన్ కోచింగ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలిండియా మొదటి ర్యాంక్ ఆరవ్ దేవాన్. రంగారెడ్డి జిల్లాకు చెందిన పానుగంటి నవ తేజ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు, మెదక్ జిల్లాకు చెందిన డి. అమూల్య మూడవ ర్యాంక్. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయాన్ వేదిక్ నాలుగవ ర్యాంక్ సాధించారు. గురుకుల విభాగంలో కూడా టాప్ ర్యాంకులు సాధించారని తెలిపారు. మొత్తం మొదటి రౌండ్లోనే 42 సీట్లు సాధించడం సంస్థకు గొప్ప విజయంగా నిలిచింది. నవోదయ. సైనిక్, ఆర్ఎంఎస్ ప్రవేశాల్లో అగ్రస్థానాలు సాధించిన ఏకైక సంస్థగా రేయాన్ నవోదయ సైనిక్ ఆకాడమీ నిలిచిందపి తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ విద్యార్థులను అభినందిస్తూ. వారి కృషి, క్రమశిక్షణే ఈ విజయాలకు మూలమని తెలిపారు. డైరెక్టర్లు జనార్ధన్ రెడ్డి. ఉమారెడ్డి మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా నాణ్యమైన విద్య అందిస్తూ అనేకమంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మంచి వసతులు, క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. రుచికరమైన ఆహారం, వసతి, కఠినమైన శిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి విజయాలతో రేయాన్ నవోదయ సైనిక్ అకాడమీ మరోసారి విద్యారంగంలో తన ప్రతిష్టను చాటుకుందని తెలిపారు.

## ఎల్బీనగర్ లో రంజాన్ వేడుకలు



జర్నలిస్ట్ డైరీ, ఎల్బీనగర్,

రంజాన్ పండుగను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎస్.కె మహమ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్ లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. సందర్భంగా మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి వారిని సన్మానం చేశారు.. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్ గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ-తూర్పు రాజకీయ సమీకరణాలు:

# గాలి ఎటు వీస్తోంది?



పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు భారత రాజకీయాల్లో ప్రత్యేకమైన స్థానం కలిగినవే. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే, అది కేవలం స్థానిక పోటీగా కాకుండా జాతీయ రాజకీయాలకు కూడా ఒక సూచికగా మారుతుంది. ఇప్పటికే పలు ఎలక్షన్ సర్వే సంస్థలు తమ అంచనాలు వెల్లడించినా, గ్రౌండ్ రియాలిటీ అనే అంశం చాలా సందర్భాల్లో వాటిని మించిపోతుంది. అందుకే ఈ రెండు రాష్ట్రాల్లో వాస్తవ పరిస్థితులను విశ్లేషించడం అవసరం.

పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే, అక్కడ రాజకీయ పోటీ ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మరియు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్యే కేంద్రీకృతమై ఉంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టిఎంసీ గత కొన్నేళ్లుగా గ్రామీణ స్థాయిలో బలమైన పట్టు సాధించింది. మహిళా ఓటర్లు, మైనారిటీలు, పేద వర్గాలపై ఈ పార్టీకి ఉన్న ప్రభావం ఇంకా తగ్గలేదు. "లక్ష్మీ భండార్", "కన్యాశ్రీ" వంటి సంక్షేమ పథకాలు మహిళలలో విశ్వాసాన్ని పెంచాయి. ఈ పథకాలు ఓటింగ్ ప్రవర్తనను గణనీయంగా ప్రభావితం చేసే అంశాలుగా మారాయి.

అయితే బీజేపీ కూడా పశ్చిమ బెంగాల్‌లో తన స్థాయిని పెంచుకుంది. ముఖ్యంగా 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ గ్రామీణ ప్రాంతాల్లోనూ తన ప్రాబల్యాన్ని విస్తరించడానికి ప్రయత్నిస్తోంది. హిందుత్వ రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అలాగే టీఎంసీల పై అవినీతి ఆరోపణలు బీజేపీకి కొంత మద్దతు తెచ్చాయి. అయినప్పటికీ, స్థానిక నాయకత్వ లోపం, అంతర్గత విభేదాలు బీజేపీకి ఒక పెద్ద అడ్డంకిగా కనిపిస్తున్నాయి.

గ్రౌండ్ రియాలిటీ ప్రకారం చూస్తే, టిఎంసీకి ఇంకా ఒక స్పష్టమైన ఆధిక్యం ఉంది. మమతా బెనర్జీ వ్యక్తిగత ఇమేజ్, ఆమె పోరాట స్వభావం, స్థానిక స్థాయిలో పార్టీ యంత్రాంగం బలంగా ఉండటం వల్ల ఈసారి కూడా టిఎంసీ ముందంజలో ఉండే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాకపోతే బీజేపీ ఓటు శాతం పెంచుకున్నా, అది విజయం సాధించడానికి సరిపోదు అనే భావన బలంగా ఉంది.

ఇక తమిళనాడు విషయానికి వస్తే, అక్కడ రాజకీయ సమీకరణాలు భిన్నంగా ఉంటాయి. ప్రధానంగా డిఎంకె మరియు ఏఐడిఎంకే మధ్య పోటీ కొనసాగుతుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ నాయకత్వంలోని డిఎంకె ప్రభుత్వం సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలు, భాషా గౌరవం వంటి అంశాలపై దృష్టి పెట్టింది. ఈ విధానాలు ప్రజల్లో ఒక స్థిరమైన మద్దతును కల్పించాయి.

ఏఐడిఎంకే మాత్రం జయలలిత మరణం తర్వాత నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ లోపల విభేదాలు, స్పష్టమైన నాయకత్వం లేకపోవడం వల్ల గ్రౌండ్ లెవెల్‌లో దాని బలం కొంత తగ్గింది. బీజేపీతో పొత్తు విషయంలో కూడా స్పష్టత లేకపోవడం, దాని ఓటు బ్యాంక్‌పై ప్రభావం చూపుతోంది.

తమిళనాడులో మరో ముఖ్య అంశం ఏమిటంటే, ఇక్కడి ఓటర్లు సాధారణంగా ప్రాంతీయ భావజాలాన్ని ప్రాధాన్యంగా చూస్తారు. భాష, సంస్కృతి, స్వాభిమానం వంటి అంశాలు ఎన్నికలలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ కోణంలో చూస్తే డిఎంకె కి స్పష్టమైన ఆధిక్యం ఉంది.

గ్రౌండ్ రియాలిటీ ప్రకారం తమిళనాడులో డిఎంకె మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఏఐడిఎంకే పునరుద్ధరణ కోసం ఇంకా సమయం అవసరం. బీజేపీ ఇక్కడ తన స్థానం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అది ఇంకా ప్రధాన పోటీదారుగా మారలేదు.

మొత్తం మీద చూస్తే, పశ్చిమ బెంగాల్‌లో టిఎంసీ, తమిళనాడులో డీఎంకే ముందంజలో ఉన్నట్లు గ్రౌండ్ రియాలిటీ సూచిస్తోంది. సర్వేలు ఒక దిశ చూపించవచ్చు కానీ చివరకు నిర్ణయం తీసుకునేది ఓటరే. స్థానిక సమస్యలు, అభ్యర్థుల ప్రవర్తన, చివరి నిమిషం సమీకరణాలు కూడా ఫలితాలను ప్రభావితం చేయగలవు.

అందువల్ల ఇప్పటి పరిస్థితుల ప్రకారం స్పష్టమైన ధోరణి ఉన్నప్పటికీ, ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఏదీ ఖచ్చితంగా చెప్పలేము. అయినప్పటికీ, ప్రస్తుత రాజకీయ గాలులు చూస్తే — బెంగాల్‌లో మమతా, తమిళనాడులో స్టాలిన్ చేతిలోనే గెలుపు తాళాలు ఉన్నాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

*డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496.



# బ్రహ్మోత్సవ శోభతో భద్రాచలం

**జర్నలిస్ట్ డైరీ,భద్రాచలం:**



భద్రాచలం లో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆలయంలో వసంత పక్ష తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా అభిషేకం, ఆరాధన, తిరుమంజన సేవలను ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు. స్థానిక తాత గుడి సెంటర్ వద్దనున్న ఆలయంలో భూమి పూజ, వాస్తు పూజ నిర్వహించి ఈ తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. మార్చి 27వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహించనున్నారు. అలాగే మార్చి 28న శ్రీ రామ మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2వ తేదీ వరకు దేవాలయంలో నిర్వహించే నిత్య కళ్యాణాలను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఆలయ ఉన్నతాధికారులు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. పక్క రాష్ట్రాల నుంచి సైతం భారీగా భక్తులు భద్రాచలంకు తరలి రానున్నారు. దాంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ, స్థానిక అధికారులు చర్యలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలంకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఇదిలా వుండగా,భద్రాద్రి రామయ్య కళ్యాణం నేపథ్యంలో ఆయన పేరు పై వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2012 వరకు దశరథ తనయుడు శ్రీరామచంద్రుడుగానే అన్ని కార్యక్రమాలు నడిచాయి. 2012 నుంచి అక్కడ ఉన్నది దశరథ పుత్రుడు కాదని.. ఆయన రామనారాయణుడని అంటూ గోత్రం, ప్రవరలను మార్చి చదువుతున్నారు. ఈ అంశంపై 2022లో హైకోర్టులో కేసు నమోదైంది. విచారణ అనంతరం న్యాయస్థానం ఈ విషయంలో అన్ని అంశాల్ని పరిశీలించి, నిగ్గు తేల్చేందుకు ఐదుగురు పండితులతో కమిటీ ఏర్పాటు చేసింది. అన్ని అంశాలను పరిశీలించిన కమిటీ 2024లో నివేదికను దేవాదాయ శాఖకు సమర్పించింది. ఇక ఆ నివేదిక హైకోర్టుకు అందడమే తరువాయి. అలా అందితేనే పండితులు ఏం తేల్చారన్నది తెలుస్తుంది. భద్రాద్రి రాముడి పుట్టుపూర్వోత్తరాల పంచాయితీకి శుభం కార్డు పడుతుంది. ఐదుగురు సభ్యుల కమిటీ నివేదికను ఇప్పటికే దేవాదాయ శాఖకు సమర్పించినప్పటికీ దాన్ని బయట పెట్టడం లేదని, హైకోర్టుకు సమర్పించడం లేదని పేర్కొంటూ పిటిషనర్ హైకోర్టులో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ చేపట్టిన కోర్టు ఇటీవల దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 23న జరగనుంది.

## ఆదివాసుల హక్కులు హరిస్తున్న లంబాడాలు

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**



ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) మహబూబాబాద్ జిల్లా సమావేశానికి హాజరవుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అక్రమ అరెస్టును ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ సాగబోయిన పాపారావు తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన ఇన్నడ మాట్లాడుతూ ఈ దేశ మూలవాసులు స్వేచ్ఛగా జీవించే హక్కును భారత రాజ్యాంగం కల్పిస్తే అందుకు భిన్నంగా తెలంగాణలో లంబడోళ్ళ రాజ్యం నడుస్తుందా అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. లంబాడాలు అధికారం ఉందని, అధికారులు మా వాళ్లే అని కుట్రలు చేస్తూ ఆదివాసీ ఉద్యమాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆదివాసులకు సమావేశాలు పెట్టుకునే హక్కు కూడా లేదనే విధంగా మహబూబాబాద్ పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల మండిపడ్డారు. తుడుం దెబ్బ జిల్లా కమిటీ సమావేశానికి హాజరవుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర నాయకులు బాబన్నను కూడా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే పోలీసులు అరెస్టు చేసిన తుడుం దెబ్బ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆదివాసి విద్యార్థులు ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు.



## కౌన్సిలర్ కు పౌల్ట్రీ ఫెడరేషన్ నేత అభినందన

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

నీతి నిజాయితీ నిబద్ధతతో ప్రజానాయకుడిగా సాగిపోవాలని భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని షాద్ నగర్ డివిజన్ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు అన్నారు. ఆదివారం షాద్ నగర్ పట్టణంలోని పాతూరి వెంకట్రావు స్వగృహంలో ఆయనను చటాన్ పల్లి బిఆర్ఎస్ కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కౌన్సిలర్ గా భారీ మెజార్టీతో గెలుపొందాక ఆయన పాతూరి వెంకట్రావు ఆశీస్సులను తీసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ ను శాలువాతో పాతూరి సన్మానించారు. ఈ సందర్భంగా పాతూరీ మాట్లాడుతూ.. చిన్న వయసులో గురుతరమైన బాధ్యతలు చేపట్టావని, భవిష్యత్తులో కూడా మరిన్ని పదవులు అలంకరించే విధంగా మంచి రాజకీయ నిర్మాణం జరగాలని వెంకటరావు సూచించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైన నిజాయితీతో నిబద్ధతగా ప్రజలకు సేవలు అందించాలని ప్రజా నాయకుడిగా వెలుగొందాలని ఆయన ఆశీర్వదించారు. అనంతరం అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. తనకంటూ ఒక దిశ దశ ఉందని రాజకీయాల్లో నిబద్ధతగా ఉండాలన్న పట్టుదల ఉందని ఎన్ని కష్ట నష్టాలు ఎదురైన మంచి నాయకుడిగా ఎదిగే ప్రయత్నం చేస్తానని అశోక్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పేపర్ శివ సుదర్శన్ నక్కల మహేష్ గౌడ్ హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బేతెస్త చర్చ్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**



కాప్రా డివిజన్ లోని బేతెస్థ చర్చి లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.
ఈ శిబిరాన్ని మాజీ కార్పోరేటర్ స్వర్ణరాజ్ శివమణి ప్రారంభించి మాట్లాడుతూ, బేతెస్త చర్చ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దైవ సేవతో పాటు పేద ప్రజల ఆరోగ్య రక్షణ కొరకు సామాజిక బాధ్యతగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన చర్చి నిర్వాహకులు బ్రదర్ రిచర్డ్ వెస్లీని అభిందించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఆసుపత్రుల నుండి నిష్ణాతులైన వైద్యులచే గాంధీనగర్ పరిసర కాలనీల ప్రజలకు జనరల్, చెవి, గొంతు, ముక్కు,దంత,కంటి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. బేతెస్త చర్చ్ వ్యవస్థాపకులు కీ శే ఫాదర్ జాన్ వెస్లీ కూడా సామాజిక కార్యక్రమాలను చురుకుగా నిర్వర్తించే వారిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాప్రా డివిజన్ గాంధీనగర్ లోని బేతెస్త చర్చి నిర్వాహకులు బ్రదర్ రిచర్డ్ వెస్లీ ముఖ్య అతిథులు మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని, అతిథులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ , గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ మహేష్, గాంధీనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జి సత్యానారాయణలను ఘనంగా సన్మానించారు. గాంధీనగర్ వెల్ఫేర్, యూత్ అసోసియేషన్ల సహకారంతో ఈరోజు ఉచిత వైద్య శిబిరం ద్వారా గాంధీనగర్ పరిసర కాలనీల ప్రజలకు వైద్య సేవలు చేసే అవకాశం లభించిందని వారు తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి గాంధీనగర్ పరిసర పేదప్రజలకు వైద్య సేవలు అందించిన చర్చ్ నిర్వాహకులు వేస్లీకి, సహకరించిన వైద్యులు, వారి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలను గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి . సత్యానారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాయక్ , గాంధీనగర్ వెల్ఫేర్, యూత్ అసోసియేషన్ల అధ్యక్షులు ఎన్ మహేష్, జి సత్య నారాయణ, స్థానిక కాంగ్రెస్ నాయకులుయూత్ అసోసియేషన్ ప్రతినిధులు తన్నీరు శ్రీహరి , జి రాజు, జి రామ్ చందర్, మనోజ్ కుమార్, గౌతమ్, రఘువీర్, గణేష్, కుమార్, ఆది జాంబవ అసోసియేషన్ ప్రతినిధులు, గాంధీనగర్ వాసులు పాల్గొన్నారు.

## బడ్జెట్ లో బీసీలకు అన్యాయం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**



రాష్ట్ర ప్రభుత్వం రూ: 3. 24 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టి బీసీలకు మాత్రం కేవలం 12, 511 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయింపులు చేయడం అన్యాయమని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఇదెక్కడి సామాజిక న్యాయమని ఈ వర్గానికి మీ ప్రభుత్వం ఏమీ న్యాయం చేసినట్లు అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, 3.24 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో బీసీలకు కేవలం 12,511 కోట్ల రూపాయలను కేటాయించి బీసీలను తీవ్రమైన అన్యాయానికి గురి చేసిందని ఆవేదనను వ్యక్తం చేశారు. బీసీలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్లను కేటాయిస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చి నేడు రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాట తప్పి బీసీలను నట్టేట్ట ముంచిందని మండిపడ్డారు. సామాజిక జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం ఇంత తక్కువ బడ్జెట్ అని ఏ మూలకు ఇవి సరిపోతుందన్నారు. బీసీ సబ్ ప్లాన్, బీసీ డిక్లరేషన్, బీసీ కార్పొరేషన్ల ఊసే లేదని ఆగ్రహం చేసారు. ఎన్నికల ముందు ప్రజలకు 420 హామీలను ఇచ్చి గద్దెనిక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికలలో కేవలం బీసీలే కాదు , నిరుద్యోగులు, మహిళలు, రైతులు, వృద్ధులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జరిపోతుల ప్రభుదాస్ ,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజన్ శేఖర్, గొల్లూరి అంజయ్య, నేర్ధం భాస్కర్, మాజీ కౌన్సిలర్ కైలాసపతి గౌడ్, లక్ష్మీనారాయణ, నేమూరి మహేష్ గౌడ్, నిరుద్యోగుల ఓయూ జేఏసీ కన్వీనర్ బిఆర్ఎస్వి నాయకులు జై కృష్ణ నియోజకవర్గం ఎస్సీ ఎస్టీ బీసీ నాయకులు పాల్గొన్నారు.

## ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**జర్నలిస్ట్ డైరీ , రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

కేశంపేట్ మండలం వేములనర్వ గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో గ్రామ సర్పంచ్ భర్త చిన్న నర్సిములు, ఆలయ పూజారి వేణయ్య పంతులు గుప్త నిధుల కోసం కొంత మంది వ్యక్తులతో కలిసి తవ్వకాలు చేపట్టడం దుర్మార్గమైన చర్య అని బిజెపి రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. వేములనర్వ గ్రామం గ్రామ యువకులు విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి అక్రమ తవ్వకాలపై వివరించారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆలయ ఈఓతో, కేశంపేట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తో ఫోన్ లో మాట్లాడి రాజకీయానికి తావు లేకుండా దుండుగులను కఠినంగా శిక్షించాలని అన్నారు. పవిత్రమైన ఆలయంలో ఇలాంటి అక్రమ తవ్వకాలు జరిపి భక్తుల మనోభావాలు దెబ్బతీయ్యొద్దు అని అన్నారు.



## ఫిర్యాదు దారులకే నోటీసులు

- **జీహెచ్ఎంసీ అధికారుల నిర్వాకం**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

గాజుల రామారం సర్కిల్ పరిధిలోని హెచ్ఎ ఎల్ నార్త్ కాలనీలో రోడ్ అక్రమించి చేస్తున్న అక్రమ నిర్మాణ పై కాలనీ వాసులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటి కమిషనర్ ఫిర్యాదు దారులకు, వారి అపార్ట్మెంటు నిర్మాణం అనుమతి, సేల్ డీ డ్ లింక్ డాక్యుమెంట్లు సమర్పించమని, వాగ్రూమ్ నిర్మాణం అక్రమమని నోటిసులు పంపించారు. ఈ నిర్మాణం పూర్తయి ఆరు సంవత్సరాలు దాటింది. ఈ బరితెగింపు అధికారులను కఠినంగా శిక్షించాలని సర్కిల్ పరిధిలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## కాంగ్రెస్ ఓబిసి చైర్మన్ గా నేడు వీర్లపల్లి శంకర్ ప్రమాణ స్వీకారం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్ ఓబిసి చైర్మన్ గా షాద్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శంకర్ ను ఓబీసీ చైర్మన్ గా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి జాతీయ బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మరెన్నో మంచి పదవులు రావాలని కోరుకుంటున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో బీసీ నేత ఎమ్మెల్యే శంకర్ కు ఈ పదవి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాతీయ బీసీ జనసేన రాష్ట్ర నాయకులు జువ్వ సుధాకర్,మేకల వెంకటేష్,జూపల్లి చంద్రశేఖర్,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోయ చేన్నయ్య,రంగారెడ్డి జిల్లా మహిళా బీసీ జనసేన అధికార ప్రతినిధి స్రవంతి రాజ్,నియోజకవర్గం అధ్యక్షురాలు జక్కల జలజ,బీసీ జనసేన రాష్ట్ర మహిళా నాయకురాలు బాస వరలక్ష్మి,షాద్ నగర్ టౌన్ అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి గౌడ్,బీసీ జనసేన జిల్లా నాయకులు ములగాని నరసింహ,సీనియర్ నాయకురాలు సింధుర,సీనియర్ నాయకులు తంగడిపల్లి శంకర్,షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు గడ్డమీద రమేష్,షాద్ నగర్ నియోజకవర్గం బీసీ జనసేన మహిళా సీనియర్ నాయకురాలు సౌజన్య,అరుణ,అనురాధ తదితరులున్నారు.

## తల్లి శవం వద్ద రాత్రంతా మూడేళ్ల చిన్నారి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**



ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదంలో మహిళ దారుణ హత్య గురైంది. స్థానికుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మండలం దేవునిపల్లి గ్రామపంచాయతీ రంగారెడ్డిగూడకు చెందిన పోతుల శోభారాణి (30) వివాహం మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండ గ్రామానికి చెందిన రాజుతో పదేండ్ల క్రితం జరిగింది. వీరి వైవాహిక జీవితం కొన్నేండ్ల పాటు సాఫీగా సాగింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నర్సింహులుతో శోభారాణికి వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం భర్తకు తెలిసి ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో నెలరోజుల క్రితం శోభారాణి భర్త రాజును వదిలేసి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వచ్చింది. అప్పటి నుంచి నర్సింహులు శోభారాణిని పెళ్లి చేసుకుంటానని కుల పెద్దలతో భర్తతో మాట్లాడాడు. దీంతో ఆగ్రహానికి గురైన భర్త రాజు శోభారాణిని శనివారం రాత్రి అత్యంత దారుణంగా చంపి రంగారెడ్డిగూడ తంగడపల్లి రహదారిలో చెట్ల పొదల్లో పడేశాడు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల చిన్నారి తల్లి శవం వద్ద రాత్రంతా రోదిస్తూ గడపడం చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుల తో వృద్ధుడి ఆత్మహత్య

**జర్నలిస్ట్ డైరీ,ఖమ్మం:**

ఖమ్మం జిల్లాలో ఒక వృద్ధుడి ఆత్మహత్య ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించింది. ఎర్రుపాలెం మండలంలో జరిగిన ఈ సంఘటన లో మృతదేహం ఉన్న స్థితిని చూసి స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. బనిగండ్లపాడు గ్రామానికి చెందిన యన్నం వెంకట్రామిరెడ్డి (70) గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. అప్పుల భారం పెరగడంతో మనస్తాపానికి గురైన ఆయన, తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సమీపంలోని ఒక బ్రిడ్జి వద్దకు వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఉరివేసుకున్న సమయంలో తాడు బిగుసుకుపోయి, మృతదేహం బరువుకు తల మొండెం నుండి వేరైపోయింది. తల బ్రిడ్జికి వేలాడుతూ ఉండగా, మొండెం కింద పడిపోవడంతో అక్కడ అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ఉదయాన్నే అటుగా వెళ్లిన స్థానికులు ఈ దృశ్యాన్ని చూసి హతాశులయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎర్రుపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహ భాగాలను సేకరించి పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రాథమిక విచారణలో అప్పుల బాధే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారణమని తేలింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## వన్యప్రాణుల ఉచ్చు ఒకరి ప్రాణం తీసింది

**జర్నలిస్ట్ డైరీ, భద్రాచలం:**

వన్యప్రాణులను వేటాడటం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఒక మనిషి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. పగిడేరు గ్రామానికి చెందిన సుమన్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున వేట కోసం ఖమ్మం తోగు - బుగ్గ అడవుల్లోకి వెళ్లారు. అదే సమయంలో అడవి జంతువుల కోసం మరో వర్గం వేటగాళ్లు రహస్యంగా భూమికి కొద్దిగా పైన విద్యుత్ తీగలను అమర్చారు. చీకట్లో ఆ తీగలను గమనించని సుమన్, వాటిని తాకడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మరణించాడు. సుమన్‌తో పాటు ఉన్న మిగిలిన ముగ్గురు అప్రమత్తమవ్వడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పెద్దపల్లి ప్రాంతానికి చెందిన కొందరు వలస గిరిజనులు అటవీ జంతువుల మాంసం కోసం ఈ విద్యుత్ ఉచ్చులను అమర్చినట్లు గుర్తించారు. వేటగాళ్ల మధ్య ఉన్న పోటీ మరియు ఇలాంటి ప్రమాదకరమైన పద్ధతులు వాడటం వల్ల ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని, ఇలాంటి ప్రమాదకరమైన విద్యుత్ తీగలు అమర్చడం వల్ల కేవలం జంతువులే కాకుండా అడవిలోకి వెళ్లే సాధారణ ప్రజలు, పశువుల కాపరులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారని అధికారులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



# నడుస్తుంటే ఈ నాలుగు లక్షణాలు గమనించారా? అయితే మీకు ఆ వ్యాధి ఉన్నట్లే!

ఇప్పుడు దేశాన్ని పట్టి పీడిస్తున్న వ్యాధి ఏదైనా ఉందంటే అది కచ్చితంగా డయాబెటిస్ అనే చెబుతారు చాలామంది. మానవుడి జీవన పరిణామ క్రమంలో చాల మార్పులే చోటుచేసుకున్నాయి. వారు తింటున్న ఆహార శైలి కూడా పూర్తిగా మారిపోయింది. ఎప్పుడు ఎలాంటి ఆహారం తింటున్నారో కూడా తెలియకుండా తినేస్తున్నారు. దీంతో పాటు ఎలాంటి వ్యాయామం చేయకపోవడం.. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం వంటి పనుల కారణంగా చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇందులో భాగంగానే చాలా మంది అధికంగా ఎదుర్కొంటున్న సమస్య ఏదైనా ఉందంటే అది షుగర్. యుక్త వయసులో ఉన్న వ్యక్తులు కూడా ఈ డయాబెటిస్ వ్యాధి బారిన పడుతున్నారు. డయాబెటిస్ అనేది శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ అసమతుల్యత వల్ల ఏర్పడే ఒక దీర్ఘకాలిక వ్యాధి. ఈ వ్యాధిని నివారించుకునేందుకు ప్రత్యేకమైన చికిత్సలు మార్కెట్‌లో ఏవీ లేవు. కానీ మందుల ద్వారా దీన్ని నియంత్రించవచ్చు. ప్రాథమికంగా ఈ వ్యాధి శరీరాన్ని సున్నితంగా ప్రభావితం చేయడం మొదలుపెడుతుంది. మొదటి దశలో దీని లక్షణాలు తక్కువగా కనిపిస్తాయి. కానీ ప్రారంభ దశలోనే కొన్ని సూచనలను గమనిస్తే, వ్యాధి మరింత ముదరకముందే దానిని నియంత్రిచుకోవచ్చు. అలాగే ఎలాంటి సమస్యలు లేకుండా జీవితాన్ని కొనసాగించొచ్చు. డయాబెటిస్ వస్తుందనడానికి ముందు నడకలో కొన్ని రకాల మార్పులు కనిపిస్తుంటాయి. ఆ మార్పులను గుర్తించగలిగితే డయాబెటిస్ వ్యాధిని మీరు సులభంగా వ్యాధి ప్రారంభదశలోనే నియంత్రించుకోవచ్చు. ఆ లక్షణాలు ఏంటంటే?

### అలసట అనిపించడం



డయాబెటిస్ ఉన్నవారిలో బలహీనత, అలసట అనేది సాధారణ లక్షణం. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల, శరీర కణాలు గ్లూకోజ్‌ను అవసరానికి అనుగుణంగా ఉపయోగించుకోలేవు. అందువల్ల శరీరానికి అవసరమైన శక్తి అందదు. ఈ పరిస్థితి నడుస్తున్నప్పుడు మరింత బలహీనత మరియు అలసట కలిగిస్తుంది. ఒకవేళ మీరు కనుక ఎక్కువగా నడుస్తున్నప్పుడు అలసటగా అనిపిస్తే ఈ వ్యాధి మీకు ప్రారంభదశలో ఉన్నట్లు అర్థం చేసుకోవాలి.



### కాళ్లలో తిమ్మిరి రావడం



డయాబెటిస్ కారణంగా నరాల వ్యవస్థకు హానీ కలుగుతుంది. దీనికి "డయాబెటిక్ న్యూరోపతి" అని అంటారు. ఈ పరిస్థితిలో, పాదాలలో నొప్పి, తిమ్మిరి మరియు ఇతర అనారోగ్య సంకేతాలు కనిపించవచ్చు. నడుస్తున్నప్పుడు కాళ్లపై ఒత్తిడి రావడంతో ఈ సమస్య మరింత తీవ్రంగా మారవచ్చు. ఒకవేళ మీ కళ్ళలో తిమ్మిరి వస్తున్నట్లు అనిపిస్తే వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించి దానికి తగిన చికిత్స తీసుకోవడం ఉత్తమం.

### వాపు సమస్యలు


డయాబెటిస్ కారణంగా రక్తప్రసరణ అవ్యవస్థితంగా మారుతుంది, దీంతో పాదాలలో వాపు ఏర్పడుతుంది. పాదాలకు సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల, శరీరంలోని ద్రవం ఎక్కువగా పెరిగి కాళ్ళు వాచినట్టు కనిపించవచ్చు. ఈ నాలుగు లక్షణాలు ఏదైనా కనిపించినా, మీరు వాటిని తేలిగ్గా తీసుకోకూడదు. డయాబెటిస్ ను సకాలంలో గుర్తించి, వ్యాధి ముదరకుండా అదుపులో ఉంచే విధంగా చికిత్స తీసుకుంటే, దీని ప్రభావాలను నియంత్రించవచ్చు.



### శ్వాస సంబంధిత ఇబ్బందులు

డయాబెటిక్ వ్యక్తులలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనేది కూడా ఒక సాధారణ సమస్య. శారీరక శ్రమ చేసేటప్పుడు, డయాబెటిస్ కారణంగా గుండె మరియు ఊపిరితిత్తులపై అదనపు ఒత్తిడి వస్తుంది, దీనివల్ల శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది.





# ఇవి పాటిస్తే మీ బంధం అసలే విడిపోదు!

ఇద్దరి వ్యక్తుల మధ్య సంబంధం బలపడాలి అంటే ప్రేమ ఉండడం చాలా అవసరం. ఆ బంధం శాశ్వతంగా నిలిచిపోవాలంటే కచ్చితంగా ప్రేమ ఉండాలి. ప్రేమ మాత్రమే కాదు.. ప్రేమతో పాటు నమ్మకం, నిజాయితీ కూడా అవసరం. ఇవన్నీ ఉంటేనే వివాహ బంధంలోనైనా, ప్రేమ బంధంలోనైనా కలకాలం కలిసి ఉండగలం. కానీ ప్రస్తుతం ఉన్న కాలంలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. జంటల మధ్య, మనస్పర్థలు, ఒకరిని ఇంకొకరు మోసం చేయడం, ఒకరు ఉండగానే ఇంకొకరితో ప్రేమాయణం నడపడం వంటివి జరుగుతున్నాయి. ముఖ్యంగా ఎంత గాఢమైన ప్రేమలో ఉన్నా, ఎదుటి వ్యక్తి ఎంతలా మిమ్మల్ని ప్రేమిస్తున్నా చాలా మంది తమ తమ స్వార్థం కోసం ఎదుటి వ్యక్తులను మోసం చేస్తున్నారు. దీంతో ప్రేమలో ఉన్న ఓ వ్యక్తి తన జీవితాన్ని అందంగా మలుచుకుంటే, మరొక వ్యక్తికి బాధ, దుఃఖం మాత్రమే మిగిలిపోతుంది. వాటి నుంచి బయటపడేందుకు వారికి చాలా సమయం పడుతుంది. ప్రేమలో మోసపోకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఎలాంటి విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి? అనేది తెలుసుకుందాం.



### ఎదుటి వారి భావోద్వేగాలను గమనిస్తూ ఉండాలి

మనిషి నియంత్రణలో లేనిది ఏదైనా ఉందంటే అది భావోద్వేగాలే. వాటిని ఎంతలా నియంత్రించుకున్నా అవి మితిమీరుతుంటాయి. అనేక సందర్భాల్లో, మనస్సు మరియు భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతాం. ఈ భావోద్వేగాలు అదుపులో లేని సమయంలో మనం ఏం చేయాలి?, ఏం చేయకూడదు అనేది తరువాత తెలుస్తుంది. అందుకే ప్రేమలో ఉన్న వ్యక్తులు లేదా భార్య భర్తలు తమ భాగస్వామి భావోద్వేగాలను పర్యవేక్షిస్తూ ఉండాలి. వారి భావోద్వేగాలను పర్యవేక్షిస్తే వారి ప్రేమను కచ్చితంగా తెలుసుకోవచ్చు. అలాగే ప్రేమలో పడడానికి ముందే ఆ వ్యక్తి నిజాయితీని కూడా గమనించాలి. వారి రూపురేఖలు చూసి ప్రేమలో పడితే రేపటి రోజున కచ్చితంగా ఇబ్బందులు పడక తప్పదు.

### ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి

ప్రేమలో సరైన నిర్ణయాలు తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రేమలో ఉన్న వ్యక్తులు సరైన నిర్ణయాలు తీసుకునేందుకు మనస్సు కూడా సహాయం చేస్తుంది. ప్రేమలో ఉండే వ్యక్తులు భావోద్వేగాలతో కాకుండా, ఆచరణాత్మకంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చాలా అవసరం. మోసపోయే వ్యక్తి తమ మాటలు, ప్రవర్తన ద్వారా వారి నిజమైన ఆలోచనలు వెల్లడిస్తారు. అబద్ధాలు చెప్తూ, తమ ప్రవర్తన ద్వారా ఇతరులను వంచించేవారిని జాగ్రత్తగా గమనించండి. అటువంటి వ్యక్తులతో సంబంధం కొనసాగించడం చాలా ప్రమాదకరం.

### నిజాయితీగా ఉండాలి

ప్రేమలో పక్షపాతం, అహంకారం వంటివి కూడా ఉండకూడదు. ఒక సంబంధంలో మీ ఆత్మ గౌరవం హరించడం ప్రారంభిస్తే, మీరు దాన్ని ఆపేందుకు ముందడుగు వేయాలి. ఇతరులు మీ గౌరవాన్ని తీసుకోవడాన్ని అనుమతించకూడదు. ఎందుకంటే అది నమ్మకానికి, నిజాయితీకి హాని కలిగిస్తుంది. గౌరవం లేని సంబంధం త్వరగా విడిపోతుంది. ప్రేమలో జాగ్రత్త, నమ్మకం, ఆలోచన చాలా ముఖ్యమైనవి. ఎప్పటికప్పుడు తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. సరిగా ఆలోచించి, దాని తర్వాత సరైన నిర్ణయాన్ని తీసుకోవాలి. ప్రేమలో జరిగే తప్పలను ఎప్పుడూ చూసీచూడనట్టు వదిలేయకూడదు. ఒకవేళ మీరు ప్రేమలో మోసపోతే మీరు ఎన్నో రకాల బాధలను, దుఃఖాన్ని అనుభవించొచ్చు. అందుకే ఆ బాధలను, దుఃఖాన్ని అనుభవించకుండా ఉండాలంటే ప్రేమలో మోసపోకుండా ఉండడానికి తగిన జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలి.

# నోరూరించే పెరుగు ఇడ్లీ.. చేసుకోండి ఇలా..



ఏప్రిల్ మాసం మొదలవబోతుంది. ఇప్పటికే ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే 35 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సమ్మర్ ప్రారంభం నుంచే భానుడి భగభగలు మొదలయ్యాయి. ఈ మండే ఎండాకాలంలో చాలామంది కడుపు చల్లగా ఉండాలని పెరుగు అన్నం లేదా పెరుగుతో తయారుచేసినవి తినడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అయితే ఈ సమ్మర్ లో ఖచ్చితంగా తినాల్సిన వంటకాల్లో పెరుగు ఇడ్లీ ఒకటి. వాస్తవానికి ఏ సీజన్ లో అయినా దీనిని ఆస్వాదించవచ్చు కానీ మండే ఎండాకాలంలో దీనిని తింటుంటే మాత్రం ఆ మజానే వేరే లెవల్లో ఉంటుంది. పిల్లలు, పెద్దలు అన్ని వయస్సుల వారికి నచ్చే వంటకం ఇది. పెరుగు ఇడ్లీ ఆఫీసులకు, స్కూల్ వెళ్లేవారికి లంచ్ బాక్స్ లలో పెట్టడానికి కూడా అనుకూలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. పెరుగు ఇడ్లీని ఇంట్లో సులభంగా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు, తయారీ విధానం తెలుసుకుందాం

### కావలసిన పదార్థాలు

- 8 ఇడ్లీ
- అర లీటరు పెరుగు
- గుప్పెడు జీడిపప్పు
- కొన్ని దానిమ్మ గింజలు
- అరకప్పు కాచిన పాలు
- 1స్పూన్ ఆవాలు
- అర స్పూన్ జీలకర్ర
- 1 పచ్చిమిర్చి
- 2 ఎండుమిర్చి
- అర స్పూన్ శెనగపప్పు
- అర స్పూన్ మినపప్పు
- మజ్జిగ
- కొంచెం కరివేపాకు
- 1 టేబుల్ స్పూన్ ఆయిల్
- రుచికి తగినంత ఉప్పు
- కొద్దిగా ఇంగువ
- 1 టేబుల్ స్పూన్ చక్కెర

### పెరుగు ఇడ్లీ తయారీ విధానం:

ముందుగా ఓ గిన్నెలో అరలీటరు పెరుగు, పావు కప్పు క్రీము లేదా కాచిన పాలు పోసి చిలకండి. ఇప్పుడు అందులో కొంచెం చక్కెర వేసి చిలకాలి. తర్వాత అందులోనే అరకప్పు నీళ్లు పోసి కలిపి పక్కనపెట్టుకోండి. ఇప్పుడు ఓ బౌల్ లో నీరు, ఉప్పు, చిలికిన మజ్జిగ పోసి బాగా కలపండి. ఇందులో పూర్తిగా చల్లారిన ఇడ్లీని అర నిమిషం పాటు ముంచి తీసి పక్కనపెట్టుకోండి. తీసి పక్కనపెట్టుకున్నఆ ఇడ్లీల మీద ముందుగా చిలికి పెట్టి ఉంచిన పెరుగు పోసి ఈ గిన్నెను ఒక గంటపాటు ఫ్రిడ్జ్ లో పెట్టేయండి. ఇప్పుడు ఓ బాండీలో ఆయిల్ పోసి దానిని వేడి చేయాలి. తర్వాత అందులో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, మినపప్పు, శెనగపప్పు, పచ్చిమిర్చి, కరివేపాకు, జీడిపప్పు, ఇంగువ వేసి ఈ తాళింపుని దోరగా వేయించి పక్కనపెట్టి పూర్తిగా చల్లారనివ్వాలి. తినడానికి ముందు ఫ్రిడ్జ్ లో పెట్టిన పెరుగు ఇడ్లీ గిన్నెను బయటకు తీసి అందులో ఈ తాళింపు, దానిమ్మ గింజలు వేసి కలుపుకోండి. అంతే అమృతం లాంటి పెరుగు ఇడ్లీ రెడీ.

# ఈ చిట్కాలతో హెయిర్ ఫాల్ మాయం!


మారుతున్న కాలానుగుణంగా వాతావరణం కూడా మారుతోంది. ఇప్పుడు ఉన్న బిజీ లైఫ్‌లో దాదాపు అన్నీ వయస్సు వారు ఎదుర్కొంటున్న సమస్య హెయిర్ ఫాల్. హెయిర్ ఫాల్‌ని తగ్గించేందుకు హోమ్ రెమిడీస్అని విలువైన ప్రాడక్స్, ట్రిక్‌మెంట్స్ అని డబ్బులు వృథా చేస్తుంటారు. జుట్టు రాలే సమస్యను కొన్ని సింపుల్ చిట్కాలతో దూరం చేసుకోవచ్చు. అవి ఎంటో ఇప్పుడు చూద్దాం..

జుట్టు రాలడం తగ్గించాలంటే హెయిర్ కేర్ అనేది చాలా ముఖ్యం. జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోడానికి మనకి రోజువారీ జీవితంలో వాడే వస్తువులతోనే నిపుణులు కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు. స్ట్రెస్ వల్ల జుట్టు రాలిపోయే అవకాశం కూడా ఉంది. ఖచ్చితంగా స్కాల్ప్‌కు మంచి మసాజ్ చేసుకోవాలి. ఇది స్ట్రెస్ తగ్గించడమే కాకుండా జుట్టు రాలడాన్ని కంట్రోల్ చేస్తోంది. జుట్టుకు నూనె పెట్టి మసాజ్ చేస్తే ఫలితాలు వస్తాయని ఓ అధ్యయనంలో తేలింది. దీని ద్వారా స్కాల్ప్‌లో రక్త ప్రసరణ పెరిగి జుట్టు ఆరోగ్యం మెరుగు పడుతుందని పేర్కొంది.

ఉల్లిపాయ రసం కూడా జుట్టు రాలడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ రసం జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. తలలో రక్త ప్రసరణను మెరుగుపరచి స్ట్రాంగ్‌గా తయారువుతుంది. అలాగే.. అలోవెరా ప్రతీ ఇంట్లో అందుబాటులో ఉండే ఒక ఔషధపు మొక్కనే చెప్పుకోవచ్చు. అలోవెరాను జుట్టు రక్షణలో రకరకాలు ఉపయోగిస్తారు.

ఇది చుండ్రును కంట్రోల్ చేసి జుట్టును కుదుళ్లను హెల్తీగా చేస్తుంది. స్వచ్ఛమైన కలబంద గుజ్జును హేర్‌కేర్ రోటీన్‌లో వాడడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు.

ఇవే కాకుండా.. తీసుకునే ఫుడ్ విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లోపలి నుంచి మంచి పోషణ అందితేనే జుట్టు అనేది స్ట్రాంగ్‌గా ఉంటుందంటున్నారు. కాబట్టి ప్రోటీన్ వంటి పోషకాలు కలిగిన ఫుడ్ తీసుకోవాలి. విటమిన్ సీ ఎక్కువగా ఉండే జామ పండ్లు తినడం వల్ల జుట్టు బలంగా పెరుగుతుంది. అంతే కాకుండా ఇది జుట్టు రాలడాన్ని నివారించి, కొత్త జుట్టు పెరుగుదలను ప్రోత్సహిచడంలో చాలాముఖ్య పాత్ర పోషిస్తుందని చెబుతుంటారు. అలాగే..నారింజ, కివీ, బొప్పాయి, ఆపిల్ పండ్లు హెయిర్ ఫాల్ తగ్గించడానికి, జుట్టు ధృడంగా ఉండడానికి ఉపయోగపడే ఫ్రూట్స్అని సూచిస్తున్నారు.







# వేసవిలో శరీర వేడిని తగ్గించేవి ఇవే..

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉదయం 8 నుంచే భానుడు భగ్గు మంటున్నాడు. జనాలు ఇంటి నుండి బయటకి వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ క్రమంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలంటూ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వేసివి లో శరీరాన్ని చల్లబరిచేందుకు ఎలాంటి డ్రింగ్స్ తీసుకోవాలో అనే విషయాలను వారు సూచిస్తు్న్నారు. వారు ఏంసూచిస్తున్నారంటే...

'అందరికీ తెలిసిన విషయమే వేసవిలో ఎక్కువ నీరు త్రాగడం తప్పనిసరి అని.. నీటితో పాటు చెరుకు రసం తీసుకుంటే శరీరాన్ని హైడ్రేట్ చేయడంతో ఉపయోగ పడుతుంది. ఇలా చేయడం వల్ల ఇంకో ఉపయోగం కూడా ఉందండోయ్.. ఇది కామెర్ల రోగులకు చెరుకు ఔషధంలా పనిచేస్తుంది. అలాగే కొబ్బరి నీరు తీసుకోవడం ద్వారా అధిక చెమటను నివారించి, శరీరం నుండి మలినాలను తొలగిస్తుంది. ప్రతీ ఇంట్లో అందుబాటులో ఉండే చింతపండు కూడా శరీరాన్ని చల్లబరచడంలో తన పాత్ర పోషిస్తది. పని మీద బయటకు వెళ్లేముందు చింతపండు నీరు రసం తాగడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉండదు' అని నిపుణులు పేర్కొంటున్నారు.

'అదేవిధంగా లెమన్.. వేసవి కాలం వచ్చింది అంటే తగ్గేదేలే అంటుంది. అన్నీటితో పోలిస్తే దీనికి ఉండే డిమాండే వేరు.. ఎన్నితాగినా.. లెమన్ నాకు ఉన్న ప్రత్యేకతే వేరంటుంది. అసలు దీనికి ఎందుకు ఇంతా డిమాండ్, దీని వల్ల ఏం ప్రయోజనాలేమంటే.. నిమ్మకాయలో విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లెవిన్, విటమిన్ బి6, ఫోలేట్ వంటి విటమిన్‌ఉల ఉంటాయి. ఈ పోషకాలు ఆరోగ్యానికి మంచిచేస్తాయి. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచే రసాల్లో నిమ్మరసం ఉత్తమమైనది. చిన్నపెద్దా అందరూ దీన్ని ఇంట్లోనే తయారు చేసుకోని తాగుతూఉంటారు. దీంతో పాటు రాగిజావ,మజ్జిగ శరీరానికి చల్లదన్నాన్ని ఇస్తాయి. వీటితో పాటు మార్కెట్లో లభించే పండ్లు నారింజ, ద్రాక్ష, వాటర్ మిలోన్, దోసకాల, ఇలా నీటి శాతం ఉండే పండ్లను తీసుకోవడం ద్వారా ఎండ తీవ్రత నుండి రక్షించుకోడానికి ఎంతగానో దోహదపడుతాయి' అంటూ వారు సూచిస్తున్నారు.





# వారెవ్వా బాదం.. ఉపయోగాలు తెలిస్తే షాక్

**బాదం.. ఇది రోజు చూసే వాటిలో ఒకటి. ఇది ప్రకృతి నుంచి లభించే ఒక ఆహార పదార్థం. దీనిలో ఔషధ గుణాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. ఆయుర్వేద వైద్యంలో బాదం ఎలా ఉపయోగ పడుతుందో తెలుసుకుందాం.**


ఈ బాదంను మన దేశంలో జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ఎక్కువగా ఉత్పత్తి చేస్తాయి. బాదంను కొంత మోతాదులో తీసుకొని రాత్రి నీటిలో నానబెట్టుకొని ఉదయం పరిగడుపున తినడం ద్వారా మంచి ఆరోగ్య ఫలితాలు వస్తాయి. అలాగే, బాదం పప్పును అంజీర పండుతో కలిపి తింటే మలబద్ధకం తగ్గుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దీనిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి.

అందుకే బాదంకు పోషకాల గని అంటుంటారు. దీనిని బాదం వెన్న, బాదం పాలు, నూనె తయారీలో కూడా వాడుతారు. బాదం పప్పును పచ్చిగా తినడంతోపాటు వివిధ వంటకాల్లో కూడా వాడుతారు. దీని ద్వారా ఎన్నో రకాల ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. అధిక బరువు ఉన్నావారి కొవ్వు తగ్గించడంలో బాదం కీలక పాత్రను పోషిస్తుంది. జీర్ణక్రియ సమస్య మెరుగుపడుతుంది.

బాదం పప్పు తినడం ద్వారా జ్ఞాపకశక్తి మరింతగ మెరుగవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తంలో తెల్ల, ఎర్ర కణాల సంఖ్యను పెంచుతుంది. అందువలన రక్తహీనత సమస్య నుంచి తప్పించుకోవడానికి ప్రతీరోజు బాదం తినాలని వైద్యులు సూచిస్తారు. అంతేకాదు.. రొమ్ము క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ వంటి వాటి నుంచి కూడా కాపాడుకోవొచ్చు. ఇది డయాబెటిస్ రోగులకు దివ్యౌషదమని చెబుతుంటారు.







# ఇరుముడి కోసం రీమిక్స్ పాట?

రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దీనికోసం ఎంతో ప్రాచుర్యం పొందిన అయ్యప్ప గీతం "ఎక్కినాడు పల్లకి"ని రీమిక్స్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్పందించారు. ఆ పాటను రీమిక్స్ చేయమని ప్రేక్షకులు, అభిమానుల నుంచి డిమాండ్ వస్తున్న మాట వాస్తవమని.. దర్శక నిర్మాతలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలియజేశారు. మరి త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందేమో చూడాలి. తండ్రీకూతురు అనుబంధాలతో ముడిపడిన ఎమోషన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ ఏడాది ఆఖర్లో తెరపైకి రానుంది. ఈ చిత్రానికి కూర్పు: ప్రవీణ్ పూడి, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ

# ధురంధర్ దూకుడు.. వసూళ్లలో రికార్డుల వేట..



రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'ధురంధర్ 2: ది రివెంజ్' సూపర్‌హిట్ టాక్ తెచ్చుకొని దూసుకుపోతుంది. అందులో రణ్‌వీర్ నటనకు సాధారణ ప్రేక్షకులతో పాటు చిత్ర పరిశ్రమ నుంచీ ప్రశంసల వర్షం కురుస్తుంది. ఊహించినట్లుగానే వసూళ్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టించే దిశగా పరుగులు పెడుతోంది. ఓపెనింగ్ వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన (రూ.354 కోట్లు) 'పుష్ప 2' రికార్డును తిరగరాసేందుకు అడుగు దూరంలో నిలిచింది. ఇది పెయిడ్ ప్రీమియర్స్‌తో కలిపి ఇప్పటిదాకా రూ.330కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.

శనివారం నుంచి తెలుగు, తమిళ, మలయాళ వెర్షన్లు కూడా అందుబాటులోకి రావడంతో 'పుష్ప 2' రికార్డును దాటడం ఈ చిత్రానికి నల్లేరుపై నడకేనని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. అంతేకాదు శనివారం నాటికి ఈ చిత్రం దేశవ్యాప్తంగా 14వేలకు పైగా షోలు ప్రదర్శిస్తున్నారని.. ఈక్రమంలోనే 74.2శాతానికి పైగా ఆక్యుపెన్సీతో థియేటర్లు నిండటం ఓ రికార్డని, చాలా రోజుల తర్వాత బాక్సాఫీస్ కళకళలాడుతోందని ట్రేడ్ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

**4గంటల సినిమా తీయాలంటే చాలా ధైర్యం కావాలి!: రాజమౌళి**

"భావోద్వేగాల పరంగా.. స్కేల్ పరంగా 'ధురంధర్: ది రివెంజ్' తొలి భాగాన్ని మించిపోయింద"న్నారు దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి. 4గంటల నిడివితో సినిమాని తీసి.. విడుదల చేయడం సామాన్యమైన విషయం కాదని.. దానికి చాలా ధైర్యం కావాలని ఆ చిత్ర దర్శకుడు ఆదిత్యధర్‌పై ప్రశంసలు కురిపించారు. ఇటీవలే ఈ చిత్రాన్ని వీక్షించిన రాజమౌళి.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ తన అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

"ధురంధర్ 1' నాకు చాలా ఇష్టం. కానీ, 'ధురంధర్ 2' స్కేల్, సోల్ పరంగా తొలి భాగాన్ని మించిపోయింది. సినిమా రచన, నటీనటుల ఎంపిక, సాంకేతికత, సంగీతం, వరల్డ్ డిజైన్, దర్శకత్వం.. అన్నీ అద్భుతం. కథలో వచ్చే ట్విస్ట్‌లు ఉత్కంఠను పెంచుతూనే మనసుని హత్తుకునేలా ఉన్నాయి. ఆదిత్యధర్ మీరు అద్భుతాన్ని సృష్టించారు. 4గంటల నిడివితో ఇలాంటి చిత్రం తీయాలంటే గట్స్ ఉండాలి. చివరి ఫ్రేమ్ వరకు ప్రేక్షకులు అలా సీట్లలోనే కూర్చుండిపోయేలా చేశారు. జస్కిరాత్ సింగ్, హమ్జా అలీ మజారిగా రెండు పాత్రల్లోనూ అద్భుతమైన నటనతో రణ్‌వీర్ సింగ్ మంత్రముగ్ధుల్ని చేశాడు. షెడ్డులో బంధించిన సోదరిని కలిసే సమయంలో ఆయన నటన మాస్టర్ క్లాస్. సినిమా ఆరంభం నుంచి పతాక సన్నివేశం వరకు రణ్‌వీర్ నటన హృదయాల్ని మెలిపెట్టేలా ఉంది. దేశ నిస్సహాయతను, అసహనాన్ని మాధవన్ ఎంత అద్భుతంగా పండించారంటే.. మీ విజయాన్ని మా సొంత విజయంగా భావించాం" అని తన పోస్ట్‌లో చిత్ర బృందాన్ని అభినందించారు రాజమౌళి. ఇక ఇప్పటికే ఈ సినిమా వీక్షించిన రామ్‌చరణ్, మహేశ్‌బాబు, విజయ్ దేవరకొండ, రవితేజ తదితర హీరోలంతా 'ధురంధర్ 2'పై ప్రశంసలు కురిపిస్తూ నెట్టింట పోస్ట్‌లు పెట్టారు. ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఈ సినిమా ఇండియన్ సినిమాకి రీసెట్ బటన్ అని అభివర్ణించారు.

# ఆ సంగతి నాకు నాలుగేళ్ల తర్వాత తెలిసింది: నిహారిక



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక నిర్మాతగా హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఆ విజయోత్సాహంలో ఆమె నిర్మించిన తాజా చిత్రం 'రాకాస'. సంగీత్ శోభన్ హీరోగా మానస శర్మ తెరకెక్కించిన ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా విశేషాలతోపాటు పలు వ్యక్తిగత విషయాలు పంచుకున్నారు నిహారిక. తన అన్నయ్య, నటుడు వరుణ్‌తేజ్ ప్రేమ వ్యవహారం గురించి అడగ్గా.. స్పందించారు.

'వరుణ్‌తేజ్- లావణ్య త్రిపాఠిల ప్రేమ గురించి తొలుత మీకే తెలుసట కదా' అని ప్రస్తావించగా.. "ఆ విషయం ముందు తెలియదు. వాళ్ల లవ్‌స్టోరీ గురించి నాలుగేళ్ల తర్వాత తెలిసింది. ఇండస్ట్రీలో అన్నయ్యకు ఎక్కువమంది స్నేహితులు లేరు. అందుకే ఆ విషయం సీక్రెట్‌గా ఉంది. అయితే, అందరూ మా అన్నయ్యను ఇంట్రావర్ట్ అనుకుంటారు. కానీ, కాదు. అలా కనిపిస్తాడంతే (నవ్వుతూ). రౌడీ.. బాగా ఏడిపిస్తాడు. అన్నయ్య బర్త్‌డే సెలబ్రేషన్స్‌కు లావణ్య వచ్చారు. మా అన్నయ్య ఎవరినీ పార్టీలకు పిలవడు కాబట్టి.. అప్పుడే వాళ్లు లవ్‌లో ఉన్నారని అర్థమైంది" అని నిహారిక చెప్పారు. వరుణ్-లావణ్య వివాహం 2023లో జరిగిన సంగతి తెలిసిందే. వీరికి ఓ కుమారుడు.

'మీరు మళ్లీ పెళ్లి చేసుకుంటారా?' అని ప్రశ్నించగా.. తప్పకుండా చేసుకుంటానని, అయితే ప్రత్యేకంగా దృష్టిపెట్టడం లేదన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి గురించి మాట్లాడుతూ.. "దానిని కొందరు జన్మ హక్కుగా భావిస్తుంటారు. భయం లేకపోవడం వల్ల అలా చేస్తున్నారు. అలాంటి వారిలో ఒకరికి సరైన శిక్ష విధిస్తే.. ఇతరులకు బుద్ధి వస్తుంది" అని పేర్కొన్నారు.

'రాకాస' గురించి చెబుతూ.. "ఫాంటసీ+ కామెడీ జానర్‌లో వచ్చిన అతి తక్కువ సినిమాల్లో ఇదొకటి. ప్రేక్షకులకు మంచి వినోదం పంచాలన్న ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం" అని చెప్పారు.

# ఇప్పటివరకూ ఇలాంటి సినిమా చేయలేదు.. తీయలేదు.. చూడలేదు..: శర్వా

ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్‌పై ఇలాంటి సినిమా చేయలేదు.. తీయలేదు.. చూడలేదు.. అంటున్నారు శర్వానంద్ (Sharwanand). ఆయన కథానాయకుడిగా నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'బైకర్' (Biker). అభిలాష్‌రెడ్డి దర్శకుడు. మాళవిక నాయర్ కథానాయిక. సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ మూవీ ఏప్రిల్ 3న (biker movie release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఆదివారం చిత్ర ట్రైలర్‌ను (Biker Trailer) విడుదల చేశారు. ఇప్పటివరకూ చూడని సరికొత్త స్పోర్ట్స్ కథాంశంతో ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

ఈ సందర్భంగా కథానాయకుడు శర్వానంద్ ప్రసంగిస్తూ "ప్రభాస్ అన్న చెప్పినట్లు, సీనియర్లు తర్వాతే మేము. ప్రస్తుతం ఇండస్ట్రీ పరిస్థితి అందరికీ తెలుసు. ఇలాంటి స్క్రిప్ట్‌లు రాయించి, నిర్మాత సెట్‌లో ఉండి పని చేయిస్తేనే మంచి సినిమాలు వస్తాయి. నిర్మాతలు మంచి కథలు ఎంపిక చేసి, బడ్జెట్‌లో సినిమాలు తీస్తే ఇండస్ట్రీ బాగుంటుంది. హీరోలుగా మేమే కాదు, అందరూ బాగుంటారు. ఈ సంక్రాంతికి చెప్పి మరీ హిట్ కొట్టా. మరోసారి చెబుతున్నా. ఈసారి 'బైకర్' బంపర్‌హిట్ అవుతుంది. తండ్రీ కొడుకుల కథ. ఇండియన్ ఫస్ట్ మోటో క్రాస్ ఫిల్మ్. ఇలాంటి కథల్లో యాక్షన్ సీక్వెన్స్ చేయడం సులభమైన విషయం కాదు. చాలా మందికి దెబ్బలు తగిలాయి. మేకింగ్ వీడియోల్లో మేము పడిన కష్టం చూస్తారు. మన తెలుగు కుర్రాడు అభిలాష్ మంచి సినిమా తీశారని అందరూ గర్వంగా చెప్పుకొంటారు. బైక్ రేసింగ్ కథలు క్లిష్టంగా ఉన్నా, అందరికీ అర్థమయ్యేలా తీశారు.ఈ మూవీ నా కెరీర్‌కు మాత్రమే కాదు, వ్యక్తిగతంగానూ, ఆరోగ్య పరంగానూ చాలా విషయాల్లో మార్పు తెచ్చింది" అని అన్నారు. ఒకవేళ ఎవరైనా 'ఎఫ్ 1' తో తమ సినిమాను పోల్చి చూస్తే సంతోషమేనని దర్శకుడు అభిలాష్‌రెడ్డి అన్నారు. అయితే, 'ఎఫ్ 1' వచ్చే సమయానికి తమ మూవీ 60శాతం చిత్రీకరణ పూర్తయిందని తెలిపారు. రేసింగ్ సన్నివేశాలన్నీ ఇండోనేషియాలోని ఒక ఐల్యాండ్‌లో షూట్ చేశామన్నారు. ఈ కథ కోసం నిర్మాతలు ఏది



అడిగితే అది ఇచ్చారని, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ నుంచి 50 మంది రేసర్లను రప్పించారని అభిలాష్ తెలిపారు. ఇక సీనియర్ నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. మంచి పాత్రలు వస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. సినిమా కోసం పనిచేసినన్ని రోజులు తనని కూడా హీరోగానే చూసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సినిమా కూడా తమ గోలీల ఫ్యాక్టరీ నుంచి ఫైనాన్స్ చేశామంటూ సరదాగా నవ్వులు పూయించారు.

## ఆదర్శవంతమైన కోడలా... దుష్టశక్తా?



ఇటీవలే 'హక్' చిత్రంలో షా బానో అనే శక్తిమంతమైన మహిళా పాత్రలో కనిపించి.. నటనతోనే ప్రేక్షకుల్ని కట్టిపడేసింది కథానాయిక యామీ గౌతమ్. తదుపరిగా కొత్త కోడలి అవతారంలో మెట్టినింటి వారిని భయపెట్టేందుకు సిద్ధమైపోయినట్లు పేర్కొంటూ రాబోయే చిత్రాన్ని ప్రకటించింది. యామీ ప్రధాన పాత్రలో బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'నయ్యి నవెల్లి'. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్ పోస్టర్‌ని ఆవిష్కరించింది చిత్రబృందం. "కొత్త కోడలిగా.. మేరట్‌లో గందరగోళంగా ఉన్న ఓ కుటుంబంలో అడుగుపెట్టిన అమ్మాయి.. దానిని స్వర్గంలా మారుస్తుంది. తను నిజంగానే ఆదర్శవంతమైన కోడలా? బహుశా వేరే లోకం నుంచి వచ్చిన దుష్ట శక్తి కూడా కావచ్చు కదా! అని తన కుటుంబంలోనే ఒకరికి అనుమానం. మరి అలాంటి విచిత్రమైన పరిస్థితుల నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది?"అనే కథాంశంతో ఈ సినిమా హారర్ కామెడీగా రూపొందనుందని చిత్రవర్గాలు తెలిపాయి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465